నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: కొండాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ఎస్ రంగారెడ్డి తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు ఇజ్జత్‌నగర్, శిల్పాహిల్స్ రోడ్ నబంబర్ 1,2,3, సన్‌షైన్ అపార్ట్‌మెంట్స్, అపర్ణావిల్లాస్, న్యాక్, ఖానామెట్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన వివరించారు.

విద్యుత్ సమస్యలు ఉంటే..

చందానగర్: చందానగర్ సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ అధికారుల వివరాలు
చందానగర్ ఏడీఈ ఆదినారాయణ : 8332872962
హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ ఏఈ ఇంద్రసేనారెడ్డి : 8985564147
చందానగర్ సబ్‌స్టేషన్ ఏఈ దీప్తి : 9440813167
వేమనకాలనీ సబ్‌స్టేషన్ ఏఈ శ్రీనివాస్‌రెడ్డి : 8985564919
తారానగర్ సబ్‌స్టేషన్ ఏఈ సుమన్ : 9440156725
ఫ్యూజ్ ఆఫ్ కాల్ 24/7 : 9490153510

శాంతిసరోవర్‌లో 'కిడ్స్ సమ్మర్ క్యాంప్'

16 నుంచి 18 వరకు నిర్వహణ

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో 'కిడ్స్ సమ్మర్ క్యాంప్' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 9 ఏళ్ళ నుంచి 14 ఏళ్ళ లోపు పిల్లలకు అవకాశం కల్పిస్తారు. రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో 'మైండ్‌ల్యాబ్, సెల్ఫ్ టాక్, క్రియేటివ్ మెడిటేషన్, మెమరీ పవర్, వాల్యూ యాక్టివిటీస్, డిజిటల్ వెల్‌నెస్' వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమంలో ముంబాయికి చెందిన రాజయోగ టీచర్ బి.కె. రితు టక్కర్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు .మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234, సెల్ ఫోన్ 8143466670లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

కాలనీవాసులకు ఇబ్బందులు కలుగుతున్నాయ్

జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు వినతి



జెడ్‌సీకి వినతిపత్రం ఇస్తున్న కాంతారావు, స్వచ్ఛ భారత్ అభియాన్ సభ్యులు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్ 1 నుంచి జేఎన్‌టీయూ వరకు ఉన్న అనధీకృత వాణిజ్య సముదాయాల వల్ల కాలనీవాసులకు ఇబ్బందులు కలుగుతున్నాయని స్వచ్ఛ భారత్ అభియాన్ ఫౌండర్, చైర్మన్ మాధవరం కాంతరావు జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా వ్యాపారాల వద్ద రద్దీని ఆసరాగా చేసుకొని మహిళలను పోకిరీలు వేధిస్తున్నారని, స్థానికులు అత్యవసర సమయాల్లో గమ్యస్థానాలకు చేరుకోలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తగిన చర్యలు తీసుకోకపోతే కాలనీవాసులతో కలిసి ఉద్యమం చేపడతామని మాధవరం కాంతారావు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ అభియాన్ సభ్యులు శ్రీకర్‌రావు, వినోద్‌గౌడ్, సర్వ పవన్, తోట రమేష్, సుధారవి, రేవతి, గోపి, వెంకటరమణ, ఆకుల రాము, లహరి, భగవంత్ రెడ్డి, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

పటేల్‌కుంట పార్కు పనుల్లో వేగం పెంచాలి

కార్పొరేటర్ మాధవరం రోజాదేవి



పనులను పరిశీలించిన కార్పొరేటర్ రోజాదేవి, అధికారులు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్‌లోని పటేల్‌కుంట పార్కులో జరుగుతున్న సుందరీకరణ, వాటర్‌పాండ్, వాకింగ్ ట్రాక్, యోగా షెడ్డు, సీసీ కెమెరాలు, అభివృద్ధి పనులను సోమవారం వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ రోజాదేవి హెచ్‌ఎండీఏ డీఈ రామారావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాటర్ పాండ్, వాకింగ్‌ట్రాక్‌లను వర్షాకాలం రాకముందే పూర్తి చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఏఇ సైనశ్రీ, ఆర్కిటెక్ట్ శ్రీలేఖ, పటేల్ కుంట పార్కు సభ్యులు చెన్నారావు, రవీంద్రరావు, జగదీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల సుందరీకరణ

షురూ..

మియాపూర్‌లో కొనసాగుతున్న పూడికతీత పనులు



మియాపూర్ లక్ష్మీనగర్ నాయినమ్మకుంట చెరువులో పనులు జరుగుతున్న దృశ్యం

మియాపూర్: చెరువులు కొత్తరూపును సంతరించుకోనున్నాయి. స్వచ్ఛంద సంస్థల సాయంతో చెరువుల సుందరీకరణకు శ్రీకారం చుట్టారు. సీఎస్ఆర్ కింద ఐటీ కంపెనీలు, మల్లిగావాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెరువుల సుందరీకరణకు అధికారులు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ క్రమంలో దీప్తీశ్రీనగర్‌లోని రేగులకుంట చెరువు, మియాపూర్‌లోని గురునాథం చెరువుల్లో గుర్రపుడెక్కను తొలగించి పూడికతీత చేపట్టారు. మురుగునీటిని మళ్లించారు. సుమారు 80శాతం పనులు పూర్తయ్యాయి. ఒకప్పుడు తాగునీరు, వ్యవసాయానికి సాగునీరందించిన చెరువులు మురుగుమయంగా మారాయి. నగరం విస్తరిస్తున్న క్రమంలో చెరువుల చుట్టు అపార్ట్‌మెంట్లు, కాలనీలు ఏర్పాటు కావడంతో మురుగునీరు చెరువుల్లో చేరి కలుషితమయ్యాయి. దుర్వాసన భరించలేక చుట్టుపక్కల కాలనీలవాసులు తీవ్ర ఇబ్బందుల పడుతున్నారు. దీనికితోడు దోమలు ప్రబలడంతో కంటిమీద కునుకు లేదంటూ వాపోతున్నారు. ఇక రోగాలబారిన పడుతున్నామని చెరువులను అభివృద్ధి చేయాలని ప్రజాప్రతినిధులకు విన్నవించారు. చెరువు చుట్టపక్కల కాలనీవాసుల ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో పనులు ప్రారంభమయ్యాయి.

- మియాపూర్‌లోని పటేల్ చెరువు, లక్ష్మీనగర్ కాలనీలోని నాయినమ్మకుంట చెరువు, మక్తమహబూబ్‌పేటలోని పెద్దకుడి చెరువు, రామసముద్రం చెరువుల అభివృద్ధి పనులకు 15 రోజుల కిందట ఎమ్మెల్యే గాంధీ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ప్రస్తుతం భారీ యంత్రాలతో పూడికతీత పనులు స్పీడుగా జరుగుతున్నాయి.
- చెరువు చుట్టూ ఉన్న కాలనీల నుండి వచ్చే మురుగునీటిని చెరువులోకి రాకుండా దారి మళ్లించి పనులు చేపట్టారు. చెరువుల సుందరీకరణ పనులు ప్రారంభమవడంతో చుట్టుపక్కల ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నాయినమ్మకుంట చెరువులో గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలు, మురుగునీరు (ఫైల్)

చెరువులకు కొత్తరూపు..



మియాపూర్‌లోని అన్ని చెరువులను దశల వారీగా అభివృద్ధి చేస్తాం. ఇప్పటికే గురునాథం చెరువు పూడిక, గుర్రపుడెక్క తొలగించారు. రెండవ దశలో మియాపూర్‌లో నాలుగు చెరువుల సుందరీకరణ పనులు ప్రారంభంకానున్నాయి. నెక్సెస్ సెలక్ట్ మాల్స్ ఐజీయూఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా మల్లిగావాడ్ పౌండేషన్ ఆధ్వర్యంలో సుందరీకరణ పనులు కొనసాగుతున్నాయి. త్వరలోనే మియాపూర్ డివిజన్ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులోకి వస్తుంది. - కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

పటాన్‌చెరులో ఫ్లైఓవర్ నిర్మించండి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పట్టణంలో వ్యాపారస్తులు, స్థానికులకు నష్టం జరగకుండా ఫ్లైఓవర్ నిర్మించాలని కేంద్ర రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని సోమవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కలిసి వినతి పత్రం అందజేశారు. బీహెచ్ఈఎల్ వద్ద రూ.136 కోట్లతో నూతనంగా నిర్మించిన బీహెచ్ఈఎల్ - లింగంపల్లి నూతన ఫ్లైఓవర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన కేంద్ర మంత్రి గడ్కరీని ఎమ్మెల్యే కలిశారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి విస్తరణ కారణంగా ఎదురయ్యే ఇబ్బందులను వినతిపత్రంలో కేంద్ర మంత్రికి తెలియజేశారు. ప్రధానంగా వ్యాపార సంస్థలకు తీవ్రనష్టం వాటిల్లుతుందనిఆయన దృష్టికి తీసుకెళ్లారు.

బంధంకొమ్ము రహదారి విస్తరణ పనుల పరిశీలన

అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని వాణీనగర్, లాలాబావి, పెద్ద చెరువు మీదుగా బంధంకొమ్ము వరకు చేపడుతున్న రహదారి విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం మున్సిపల్, విద్యుత్‌శాఖ అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులతో కలిసి రహదారి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా 23 కోట్ల రూపాయలతో రహదారి విస్తరణ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. బంధంకొమ్ము పరిధిలో విద్యుత్ స్తంభాల తరలింపు, నూతన లైన్ల ఏర్పాటుకు గతంలో 4 కోట్ల 70 లక్షల రూపాయలను కేటాయించడం జరిగిందని తెలిపారు. విద్యుత్ సంబంధిత పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే వాణీనగర్ నుండి పెద్ద చెరువు వరకు రహదారి విస్తరణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. త్వరలో మిగిలిన పనులను సైతం పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, తహసీల్దార్ వెంకటస్వామి, మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, విద్యుత్ శాఖ డీఈ భాస్కర్‌రావు, మున్సిపల్ ఇంజనీరింగ్ డీఈ వెంకటరమణ, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రతి కాలనీ, బస్తీని అభివృద్ధి చేస్తాం



నాలా విస్తరణ చేయనున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జగదీశ్వర్‌గౌడ్, అధికారులు

కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్

చందానగర్: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ప్రతి కాలనీ, బస్తీని అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి, గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీ విద్యావాణి పాఠశాల వద్ద నాలా విస్తరించాల్సిన ప్రాంతాన్ని సంబంధిత అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కాలనీ, బస్తీలలో పర్యటించి సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజలు తమ సమస్యలను తెలియజేయాలన్నారు. పర్యటనలో ఇంజనీరింగ్, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి, ఇరిగేషన్ శాఖ అధికారులు అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియను సులభతరం చేయాలి



డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొ.బాలునాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఫోరం నాయకులు

కేపీహెచ్‌బీకాలనీ: దళిత, గిరిజన, బలహీన వర్గాల విద్యార్థులు పీహెచ్‌డీ చేసేలా అడ్మిషన్ల ప్రక్రియను సులభతరం చేయాలని కోరుతూ జేఎన్‌టీయూహెచ్ స్టూడెంట్ ప్రొటెక్షన్ ఫోరం నాయకులు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ బాలునాయక్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫోరం నాయకులు పూల అరవింద్ కుమార్ మాట్లాడుతూ.. అనేక మంది విద్యార్థులు ఎంటెక్ పూర్తి చేసి పీహెచ్‌డీలు చేయటానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. అందుకు అనుగుణంగా విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు పీహెచ్‌డీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఆయా పీహెచ్‌డీ నోటిఫికేషన్‌లో నియమ నిబంధనలను దళిత గిరిజన బలహీన వర్గాల విద్యార్థులకు ఎక్కువ మందికి పీహెచ్‌డి అడ్మిషన్‌లు పొందేలా రూపొందించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ బాలునాయక్ మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరలో ఉపకులపతితో చర్చించి నియమ నిబంధనలను రూపొందిస్తామన్నారు.

రైతులు 'ఈ ఫార్మర్'గా నమోదు చేసుకోవాలి: ఏఓ

శంషాబాద్ రూరల్: రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలతో ఈ ఫార్మర్‌గా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్వేత ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి రైతుకు 11 అంకెలతో కూడిన విశిష్ట సంఖ్యను కేటాయిస్తారని పేర్కొన్నారు. రైతు ఆధార్ కార్డును అనుసంధానం చేస్తూ రెవెన్యూ రికార్డుల ఆధారంగా ఈ ఫార్మర్ ఐడీని కేటాయిస్తారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు పొందడానికి ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రైతు ఆధార్ కార్డు, భూ యాజమాన్య పాసు పుస్తకం, ఆధార్‌తో లింకు చేసి ఉన్న ఫోన్ నంబరుతో మండల వ్యవసాయశాఖ కార్యాలయం లేదా మీసేవా కేంద్రంలో సంప్రదించాలని ఏఓ సూచించారు.

ప్రజావాణి.. 11 ఫిర్యాదులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 11 ఫిర్యాదులు అందజేశారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 8, ఇంజనీరింగ్, ఎంటమాలజీ, రెవెన్యూ విభాగాలకు ఒక్కొక్క దరఖాస్తు వచ్చినట్లు అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఈఈ దుర్గా ప్రసాద్, ఏఎంసీలు ప్రేమ్‌కుమార్, ఏసీపీ వెంకటరమణ, ప్రాజెక్టు ఆఫీసర్ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేడు సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ మంగళవారం పలు ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శంకుస్థాపన చేయనున్నారు. 2 కోట్ల 48 లక్షల 70 వేల రూపాయల అంచనా వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు ఈస్ట్ సాయి నగర్ కాలనీలో 57.50 లక్షల వ్యయంతో, మొగులమ్మ బస్తీ, పీజేఆర్ నగర్, దత్తాత్రేయ కాలనీలో 53 లక్షల వ్యయంతో, శంషీగూడ, ఇంద్రహిల్స్ కాలనీలో 76.20 లక్షల వ్యయంతో, హెచ్‌యంటీ శాతవాహననగర్, జయ నగర్ కాలనీల్లో 62 లక్షల అంచనా వ్యయంతో చేపట్టబోయే రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో 22 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా పది మందికి రూ.1500 చొప్పున, ఇద్దరికి రూ.2000, మరో పది మందికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

మియాపూర్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు స్వర్గీయ కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ శత జయంతి సభను విజయవంతం చేయాలని ఎంసీపీఐయూ గ్రేటర్ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి తుడుం అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. మియాపూర్ ఎంఏనగర్ ఎంసీపీఐయూ కార్యాలయంలో శత జయంతి సభకు సంబంధించి వాల్ పోస్టర్‌ను నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వరంగల్ జిల్లా మచ్చాపూర్ వద్ద ఈ నెల 12వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఓంకార్ శత జయంతి సభ జరుగుతుందన్నారు. ఈ సభకు ప్రజాతంత్రవాదులు, మేధావులు, కవులు, కళాకారులు, నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున, కార్యదర్శి వర్గ సభ్యులు ఇస్లావత్ దశరథ్ నాయక్, పల్లె మురళి, అంగడి పుష్ప, కర్రదానయ్య, లలిత, అరుణ, రజియాబేగం, సుల్తానా బేగం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఓంకార్ శత జయంతి ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

సెలవుల్లో క్లాసులు నిర్వహించే కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళి

మియాపూర్: వేసవి సెలవుల్లో క్లాసులు నిర్వహించే కళాశాలల పర్మిషన్లు రద్దు చేయాలని ఏఐఎఫ్‌డిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి, కార్యదర్శి గడ్డం నాగార్జున్ డిమాండ్ చేశారు. మియాపూర్ ఎంఏనగర్ కాలనీలో తాండ్ర రామచంద్రయ్య భవన్‌లో ఏఐఎఫ్‌డిఎస్ గ్రేటర్ హైదరాబాద్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్‌లో ఉన్న కళాశాలలు వేసవి సెలవుల్లో క్లాసులు నిర్వహిస్తున్నాయని విద్యాశాఖ అధికారి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సపోర్టు చేస్తున్న సంబంధిత అధికారిని తక్షణమే సస్పెండ్ చేయాలని ,చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కన్వీనర్ శ్రీకాంత్, అరుణ్, వేణు, ప్రశాంత్, పవన్, రాజేష్, సన్నీ, వంశీ, శివశంకర్ తదితరులున్నారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌లు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి మండల పరిధిలోని వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి పార్టు డివిజన్‌లకు చెందిన పలువురు లబ్ధిదారులకు సోమవారం ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, రాగం నాగేందర్ యాదవ్‌లతో కలిసి కలిసి కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. 30 మంది లబ్ధిదారులకు 30 లక్షల 3 వేల 480 రూపాయలు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, అక్తర్, ఎండి ఇబ్రహీం, సమ్మారెడ్డి ,ఖాసీం, మహమ్మద్ బేగ్, మంజుల, జుబేదా బేగం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు ఎంతకష్టమో!

స్టాపులున్నా.. బస్సులే రావు..!

- ఎండమావిగా బస్సుల రాకపోకలు
- పాత శంషాబాద్ రహదారుల్లో వృథాగా బస్టాప్‌లు
- బస్సుల పునరుద్ధరణకు స్థానికుల డిమాండ్



సిద్ధాంతి రైల్వేగేటు వద్ద నిరుపయోగంగా ఉన్న బస్టాప్



రైల్వేకమాన్ సమీపంలో..

శంషాబాద్: ఆ రహదారుల్లో బస్టాప్‌లు దిష్టిబొమ్మల్లా మారాయి.. నిరుపయోగంగా మారిన బస్టాప్‌ల ముందు మట్టికుప్పలు పేరుకుపోతున్నాయి.. బస్సులు రాని రూట్లలో అసలు బస్టాప్‌లు ఎందుకు నిర్మించారన్నది పెద్ద ప్రశ్నగా మారింది.

పాత శంషాబాద్ రహదారుల్లో...

పట్టణంలోని పాత పోలీస్‌స్టేషన్ నుంచి ప్రధాన చౌరస్తాకు వచ్చే రహదారిలో ఓ కాంప్లెక్స్ పక్కనే బస్టాప్ నిర్మాణం చేసి ఏడాదిన్నరకుపైగా కావస్తోంది. సంబంధిత రహదారిలో బస్సులు నడపటం ఆపేసి సుమారు దశాబ్దకాలం దాటుతోంది. అయినా అక్కడ బస్టాప్ ఎందుకు నిర్మించారన్నది ప్రశ్నగా మారింది. ఎలాగో పనికిరాకుండా ఉన్న ఈ బస్టాప్‌కు ఎదురుగా రాకపోకలు సాగించే రోడ్డులో భారీ ఎత్తున మట్టిదిబ్బలున్నా దానిని తొలగించకుండా మున్సిపల్ అధికారులు కాలయాపన చేస్తుండటమూ మరో సమస్యగా మారింది.

- పాత శంషాబాద్‌లోకి వచ్చే మరో రహదారి సిద్ధాంతి రైల్వేగేటు వద్ద కూడా ఓ బస్టాప్ ఏర్పాటు చేశారు. ఈ రహదారి గుండా ఒక్క బస్సు కూడా రాదు. దీనిని ఇక్కడ ఎందుకు ఏర్పాటు చేశారన్నది కూడా అర్థం కాకుండా ఉంది. సిద్ధాంతి ప్రధాన రహదారిలో హనుమాన్ దేవాలయానికి సమీపంలో ఓ బస్టాప్ ఏర్పాటు చేసినా అక్కడ బస్సులు ఆగకుండా కొద్ది ముందుకు వెళ్లిన తర్వాత ఆపుతుండటంతో అక్కడా నిరుపయోగంగా మారింది.

ఇక్కడ అవసరమున్నా...

ప్రస్తుతం పాత శంషాబాద్ వైపు బస్సుల రాకపోకలు లేక ఏళ్లు గడుస్తున్నాయి. బెంగుళూరు రహదారిలో ప్రధాన చౌరస్తా వద్ద ఏర్పాటు అవసరమున్నా అక్కడ సరైన స్థలం లేని కారణంగా షెల్టర్ ఏర్పాటు లేదు. దీనికి సమీపంలో ప్రధాన రహదారిపై బస్టాప్ ఏర్పాటు చేయడం అత్యవసరంగా ఉంది. రాళ్లగూడ రహదారివైపు కూడా వివిధ గ్రామాలకు వెళ్లే బస్సులుంటాయి. ఇక్కడ కూడా పలు చోట అవసరమున్నా ఒక్కచోట కూడా ఏర్పాటు చేయలేదు.

బస్సులు నడపాలి..

పాత శంషాబాద్‌లో ప్రభుత్వ బాలబాలికల ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వేలాది మంది విద్యార్థులు ఇప్పటికీ ఆటోలను ఆశ్రయించడంతో పాటు నడకపైనే ఆధారపడుతున్నారు. బస్తీల ప్రజలకు కూడా ఆటోలే దిక్కుగా మారాయి. ఆయా రహదారుల్లో బస్సులను పునరుద్ధరించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

బీరంగూడలో రామ్‌రాజ్ కాటన్ షోరూం ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: బీరంగూడ కూడలిలో రామ్‌రాజ్ కాటన్ షోరూంను ఆదివారం విశ్రాంత ఐఏఎస్ అధికారి పార్థసారధి ప్రారంభించారు. రామ్‌రాజ్ అంటే నమ్మకమైన, ఆకర్షణీయమైన బ్రాండ్ అని సంప్రదాయ వస్త్రాలకు ప్రసిద్ధి అని అన్నారు. భారత దేశంలోనే కాకుండా శ్రీలంక, సింగపూర్, మలేషియా దేశాల్లోనూ రామ్‌రాజ్ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని సంస్థ ప్రతినిధులు వివరించారు.

సమ్మెను జయప్రదం చేద్దాం

రాజేంద్రనగర్: కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 20న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా మున్సిపల్ సంఘం (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్‌కు ఆయన సమ్మె నోటీసును అందజేశారు.